సాక్షి అనకాపల్లి

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



అరకొరగా యూరియా...

యూరియా కోసం రైతుల పడిగాపులు కొన సాగుతున్నాయి. మంగళవారం కూడా కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ తీరును రైతులు నిరసించారు.

8లో



వెలుగు వీవోఏల ధర్నా

వెలుగు వీవోఏల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం అనకాపల్లి డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

8లో

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదురోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షంపడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 33.1 నుంచి 34.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 25.8 నుంచి 26.0 డిగ్రీలు ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

ఉపమాకలో ఘనంగా ఉట్లోత్సవం



బేడామండపం వద్ద ఉట్లోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం **ఉపమాకలో** రెండు రోజుల పాటు **జరిగిన వైష్ణవ కృష్ణాష్టమి** వేడుకలు మంగళ**వారంతో ముగిశాయి. ఈవే**డుకల్లో భాగంగా **ఉట్ల ఉత్సవం నేత్రపర్వంగా** జరిగింది. ఉదయం **స్వామివారి మూలవిరా**ట్‌కు, ఉత్సవమూ**ర్తులకు, క్షేత్రపాలకుడు వేణు**గోపాలస్వామికి, **గోదాదేవి అమ్మవారికి నిత్య**పూజలు, ఆరాధన**లు కైంకర్యాలు పూర్తిచేశారు.** అనంతరం కృష్ణాష్టమి **వేడుకల్లో భాగంగా** స్వామివారి ఉత్సవ **మూర్తులను పీఠంపై ఉంచి** విష్వక్సేన పూజ, **పుణ్యాహవచనం, ఉట్టికి** షోడోపచారపూజ**లు నిర్వహించారు. అనం**తరం ఏకాంతంగా **ఉట్లోత్సవం నిర్వహిం**చారు. నీరాజన **మంత్రపుష్పాలు, తీర్థగోష్టి,** నిత్యసేవాకాలం, **విశేష ప్రసాద నివేదన,** ప్రసాద వినియోగ**ం జరిగాయి. ఈ కార్యక్ర**మంలో ప్రధానార్చ**కులు గొట్టుముక్కల వర**ప్రసాదాచార్యులు, **సంకర్షణవల్లి కృష్ణమాచా**ర్యులు, రాజగో**పాలాచార్యులు, శ్రీనివసాచా**ర్యులు,గోపాలాచా**ర్యులు పాల్గొన్నారు.**

రేషన్ షాపులకు అధునాతన ఇ-పోస్ యంత్రాలు



డీలర్లకు ఇ-పోస్ యంత్రాలను అందజేస్తున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: చౌక ధరల దుకాణాలకు అధునాతన ఇ-పోస్ యంత్రాలను సరఫరా చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, డీలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు జిల్లాలో 1,069 చౌకధరల దుకాణాలకు అధునాతన ఇ-పోస్ యంత్రాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. స్మార్ట్ రేషను కార్డుల పంపిణీ సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంపిణీ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పత్రికా స్వేచ్ఛను హరిస్తామంటే ఎలా?

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం, ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి పత్రికల స్వేచ్ఛను పోలీసు కేసులతో ప్రభుత్వం హరిస్తామంటే ఎలా..? ఇటీవల సాక్షిలో ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడిన ప్రెస్‌మీట్ వార్తగా రాస్తే.. సంబంధిత జర్నలిస్టుతో పాటు ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసు పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. మీడియా గొంతును నొక్కే ప్రయత్నాలకు పాల్ప డుతోంది. అక్షరాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను నోటీసు లు, అక్రమ కేసులతో పోలీసులు నిరోధించలేరు. మొదటి నుంచి కూటమి ప్రభుత్వం వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న సాక్షిపై వేధింపులకు పాల్పడుతోంది.

– పెట్ల ఉమా శంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్యే



ప్రభుత్వ తీరు దారుణం

తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొదటి నుంచీ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తోంది. తాజాగా పత్రికా స్వేచ్ఛను కూడా ప్రభుత్వం హరిస్తోంది. జర్నలిస్టులపై, సాక్షిపై వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంది. విలేకరుల సమావేశంలో నాయకుల మాటలను వార్తలుగా ప్రచురిస్తే పత్రికలపై కేసులు పెట్టడం చరిత్రలో తొలిసారి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే బాధ్యత మీడియాపై ఉంది. రాష్ట్రంలోని ప్రజలు ప్రతీ అంశాన్ని గమనిస్తున్నారు. కచ్చితంగా కూటమి ప్రభుత్వానికి తగదని గుణపాఠం తప్పదు.

– అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే



టూర్ పేరుతో టార్గెట్లు!



కార్పొరేటర్ల అధ్యయన యాత్రకు జీవీఎంసీలోని అన్ని విభాగాల నుంచి కలెక్షన్

- జీవీఎంసీ రెవెన్యూ విభాగానికి భారీ లక్ష్యం
- ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, వాటర్ వర్క్స్ నుంచి వసూళ్లు
- అందరికీ ఇవ్వాలంటూ తెగబడిన జీవీఎంసీలోని కీలక నేత
- కోటి రూపాయలు దండుకున్నట్లు విమర్శలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో కూటమి నేతల వసూళ్ల పర్వానికి అంతులేకుండా పోతోంది. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ పేరుతో వసూళ్లకు తెగబడిన కూటమి నేతలు.. ఇప్పుడు కార్పొరేటర్ల అధ్యయన యాత్ర పేరుతో టార్గెట్లు విధించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. జీవీఎంసీలో కీలకంగా వ్యవహరిస్తున్న నేత విభాగాల వారీగా లక్ష్యాలు విధించి మరీ భారీగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్, యూసీడీ ఇలా అన్ని విభాగాల అధికారులను పిలిచి ఇంత మొత్తం వసూలు చేసి ఇవ్వాలంటూ లక్ష్యాలు విధించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జైపూర్, జోద్‌పూర్, జైసల్మేర్, ఢిల్లీ ప్రాంతాల్లో అధ్యయన యాత్ర పేరుతో జీవీఎంసీ కార్పొరేటర్లు వెళుతున్నారు. ఈ యాత్రకు జనసేనకు చెందిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, సీపీఎం కార్పొరేటర్ గంగారావుతో సహా 15 మంది దూరంగా ఉంటున్నారు. అయితే, కార్పొరేటర్లు టూర్ వెళుతున్నందున.. కూటమి కార్పొరేటర్లకు కొంత మొత్తం ఖర్చుల కోసం ఇవ్వాలంటూ ఈ వసూళ్లకు దిగినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ మేరకు కొన్ని విభాగాల నుంచి సదరు కీలక నేతకు భారీ మొత్తం ముట్టినట్టు కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా కోటి రూపాయల మేర ఈ విధంగా దండుకున్నట్టు తెలుస్తోంది.

సీఎం కంటే టూరే ముద్దు!

వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం విశాఖ వస్తున్నారు. అయితే, సీఎం నగరానికి వస్తున్న సమయంలో ప్రోటోకాల్ మేరకు నగర ప్రథమ పౌరుడు మేయర్ స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయినప్పటికీ సీఎం పర్యటనకు ముందు రోజే మేయర్ పీలా శ్రీనివాసరావు విమానంలో పర్యటనకు వెళ్లిపోవడంపై సొంత పార్టీలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర ప్రథమ పౌరుడిగా సీఎంకు స్వాగతం పలకకుండా టూర్‌కు వెళ్లడం ఏమిటంటూ వాపోతున్నారు. ఇప్పటికే మేయర్ వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్న సొంత పార్టీకి చెందిన నేతలు.. ఇదే విషయంపై నేరుగా సీఎం చంద్రబాబుకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు తెలుస్తోంది.

వసూళ్ల పర్వం...!

వాస్తవానికి కూటమి నేతలు జీవీఎంసీ పగ్గాలు చేపట్టిన తర్వాత కొత్త ప్రాజెక్టును కూడా ప్రారంభించలేదు. పైగా చికెన్ వ్యర్థాల పేరుతో జోన్‌ను ఒకరిద్దరు నేతలు పంచుకుని మరీ చేపలు, ఎరువుల చెరువుల యజమానులకు విక్రయించుకుంటున్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ జీవీఎంసీ పరువును కాస్తా రోడ్డున పడేశారు. ఇక స్టాండింగ్ కమిటీ పేరుతో పనులను ఆమోదించేందుకు 10 శాతం మేర కమీషన్‌ను వసూలు చేశారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అనధికార కట్టడాలకు అంతస్తుకు ఇంత మొత్తం ఇవ్వాల్సిందేనంటూ లక్షలకు లక్షలు బిల్డర్ల వద్ద నుంచి తీసుకుంటున్నారు. ఇక పోస్టింగుల కోసం కూడా జీవీఎంసీలోని కీలక నేత భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇవి చాలదన్నట్టుగా ఇప్పుడు టూర్ పేరుతో కూడా టార్గెట్లు విధించడంపై జీవీఎంసీలోని అధికారులతో పాటు కాంట్రాక్టర్లు కూడా మండిపడుతున్నారు. ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్‌తో పాటు రెవెన్యూ అధికారులకు భారీగా టార్గెట్లు విధించారని తెలుస్తోంది. అధికారికంగా ఈ టూర్ కోసం జీవీఎంసీ ఖజానా నుంచి ఒక కోటి 53 లక్షల రూపాయల మేర ఇప్పటికే నిధులను విడుదల చేయగా... అనధికారికంగా మరో కోటి రూపాయల మేర వసూళ్లు చేసినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

వ్యతిరేకత తగ్గించుకునేందుకు...!

వాస్తవానికి సదరు జీవీఎంసీలోని కీలక నేత వ్యవహారశైలిపై రోజురోజుకీ సొంత పార్టీ నేతలతో పాటు కూటమి కార్పొరేటర్ల నుంచి కూడా వ్యతిరేకత పెరుగుతోంది. మొదట్లో అందరితో కలుపుగోలుగా ఉన్నట్టు నటించిన సదరు నేత.. ఇప్పుడు అందరితోనూ అంటీముట్టనట్టుగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా వసూళ్ల వ్యవహారంలో ఎవరితో సంబంధం లేకుండా సొంత టీంతో వ్యవహారాలు సాగించడంపైనా లోలోపల రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో మొన్నటి వరకూ ఆయన వ్యవహారశైలి పట్ల మండిపడిన ముగ్గురికే ఈ వసూళ్ల బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. తద్వారా వ్యతిరేకత తగ్గించుకునేందుకు ఈ టూర్‌ను ఉపయోగించుకుంటున్నారని తెలుస్తోంది. అక్షరాలా కోటి రూపాయలను దండుకోవాలని లక్ష్యంగా పెట్టుకుని మరీ ముక్కుపిండి మరీ వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల్లోని అధికారులను గుర్తించి.. వారికే వసూళ్ల బాధ్యతలను అప్పగించినట్టు తెలుస్తోంది.

కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల నిరసన



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

తుమ్మపాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాణ త్రినాథ్, జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎస్. ధర్మారావు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీని నియమించి, ఐఆర్ ప్రకటించాలని, ఈహెచ్ఎస్ పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించి, బోధనకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పెండింగ్ డీఏల విడుదల, మెమో నంబర్ 57 అమలు తదితర పలు అంశాలపై డీఆర్వో సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, సభ్యులు మహాలక్ష్మి నాయుడు, బి.దేముడు బాబు, కె.విజయ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



కేజీబీవీని తనిఖీ చేస్తున్న డీఈవో

బుచ్చెయ్యపేట: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి, విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు తెలిపారు. వడ్డాది కేజీబీవీని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థినుల సంఖ్య, హాజరు పట్టికలను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను, తాగునీటి సరఫరా పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామూర్తినాయుడు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యమా?.. పోలీస్ రాజ్యమా?

దీక్షకు ఆటంకం కలిగించడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మత్స్యకారులు

- బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా మూడో రోజు కొనసాగిన నిరాహార దీక్ష
- భారీ ఎత్తున పాల్గొన్న జనం
- మైక్ పెట్టేందుకు అంగీకరించని పోలీసులు
- రాజయ్యపేటలో భారీగా మోహరింపు



బల్క్‌డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేటలో మూడో రోజు నిరాహార దీక్షలో పాల్గొన్న మత్స్యకారులు

నక్కపల్లి: 'మేమంతా ప్రజాస్వామ్యంలో ఉన్నామా పోలీసు రాజ్యంలో ఉన్నామా, మా బాధలు చెప్పుకునే స్వేచ్ఛకూడా మాకులేదా.. శాంతియుతంగా నిరసన తెలపడానికి కూడా అవకాశమివ్వరా.. మేమేమైనా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తున్నామా, పోలీసు విధులకు ఆటంకంకగిస్తున్నామా.. విషపూరితమైన కంపెనీల వల్ల మా ప్రాణాలు పోతాయి, అటువంటి కంపెనీలు మావద్ద ఏర్పాటు చేయొద్దంటూ ప్రభుత్వానికి తెలియజేయడం కోసమే మా గ్రామంలోనే శాంతియుతంగా నిరాహార దీక్ష చేసుకుంటామంటే ప్రభుత్వం పోలీసులతో ఇన్ని అడ్డంకులు సృష్టిస్తూ దారుణంగా వ్యవహరిస్తుందా' అంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మా గొంతునొక్కేయడం కోసమేనా మంత్రి అనితకు మా గ్రామం తరపున రెండువేల ఓట్ల మెజార్టీ ఇచ్చామా అంటూ ఆగ్రహంతో రగిలిపోయారు.

రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ అక్కడ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన మూడో రోజు కొనసాగింది. మంగళవారం మత్స్యకారులంతా కూలిపనులు మానుకుని, వేటకు విరామం ప్రకటించి శిబిరం వద్దకు భారీగా చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. టెంట్లు వేయడానికి వీల్లేదని పోలీసులు అడ్డుకోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ దీక్ష కొనసాగించారు. మంగళవారం మత్స్యకారుల దీక్షకు వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. వచ్చిన నాయకులు తమ నుద్దేశించి భరోసా ఇచ్చే విధంగా ప్రసంగించేందుకు మైక్ ఏర్పాటు చేస్తే దాన్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు. డీజే బాక్సులు తీసుకురావడాన్ని సీఐ,ఎస్ఐలు అడ్డుకోవడంతో మహిళలంతా ఒక్కసారిగా పోలీసులపై విరుచుకుపడటానికి సిద్ధపడ్డారు. ఇంతలో నిర్వాహకులు జోక్యం చేసుకుని వారిని వారించారు. హ్యాండ్‌మైక్ ద్వారా నాయకులు ప్రసంగించేందుకు పోలీసులు అనుమతిచ్చారు.

అడ్డుకోవడం తగదు

వైఎస్సార్‌సీపీ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు హాని కలిగించే బల్క్ డ్రగ్‌పార్క్‌ను ఇక్కడ మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. గతంలో ఇదే పార్క్ కాకినాడ సమీపంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే టీడీపీ నేత యనమల రామకృష్ణుడు ప్రభుత్వానికి లేఖరాశారని, పవన్ కల్యాణ్ ధర్నా చేశారన్నారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని చెప్పారు. ఇప్పుడు రాజయ్యపేటలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తూ మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తే పోలీసులు అడ్డుకోవడం, అనుమతి ఇవ్వకపోవడంతో పాటు సుమారు 35 మందిపై కేసులు నమోదు చేయడం తగదన్నారు. ఈవిషయాన్ని వైఎస్సార్‌సీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అవసరమైతే రాష్ట్రనాయకులను రాజయ్యపేట రప్పించి మత్స్యకారులకు అండగా నిలబడతామని తెలిపారు. కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. సీపీఎం జిల్లాకార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ తమప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులపై పోలీసులు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కంపెనీలు వస్తే రాజయ్యపేట పరిసర ప్రాంతాలు వల్లకాడుగా మారతాయన్నారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులతో మత్స్యకారులు ఇబ్బంది పడాల్సి వస్తుందని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఆందోళన చేస్తే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే హెటిరో డ్రగ్స్ వల్ల మత్స్యకారుల జీవనోపాధి కోల్పోయారని, అనేక రుగ్మతలతో బాధపడుతున్నారని చెప్పారు. బల్క్ డ్రగ్‌పేరుతో వందలాది కంపెనీలు పెట్టి ఈ ప్రాంతాన్ని శ్మశానంగా మార్చే

మిగతా 8వ పేజీలో ▶



నిరాహారదీక్ష వద్దకు మైక్‌సెట్ తీసుకు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు



టెంట్లు వేయడానికి అనుమతి ఇవ్వకపోవడంతో ఎండలో గొడుగులతో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీనేత వీసం రామకృష్ణ

మత్స్యకారుల ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఆర్‌డీవో వివి రమణ



మత్స్యకారుల తో మాట్లాడుతున్న ఆర్‌డీవో రమణ

నక్కపల్లి: బల్క్ డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా మూడు రోజుల నుంచి మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నర్సీపట్నం ఆర్‌డీవో వి.వి. రమణ తెలిపారు. మంగళవారం ఆయన రాజయ్యపేటలో పర్యటించి, నిరాహారదీక్ష శిబిరం వద్దకు వెళ్లారు. బల్క్ డ్రగ్‌పార్క్ ఏర్పాటయితే ఈ ప్రాంత మంతా కాలుష్యమవుతుందని, ప్రజలు క్యాన్సర్,కిడ్నీసమస్యలు వంటి రుగ్మతలతో బాధపడతారని, ప్రజలప్రాణాలకు హానికలిగించే ఈ బల్క్ డ్రగ్‌పార్క్‌ను రద్దుచేయాలని మత్స్యకారులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ ఎటువంటి హింసాత్మక సంఘటనలకు పాల్పడరాదన్నారు. అనుమతులు లేకుండా ఆందోళనలు చేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని, గ్రామస్తులు సంయమనం పాటించాలన్నారు. మీ ఆందోళన కలెక్టర్, హోంమంత్రి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆర్‌డీవో వెంట తహసీల్దార్ నర్సింహమూర్తి, సీఐ కుమారస్వామి ఎస్ఐ సన్నిబాబు ఉన్నారు.

బెంగళూరు-కామాఖ్య ఎక్స్‌ప్రెస్ దారిమళ్లింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్టన్ రైల్వే, అసన్‌సోల్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆయా తేదీల్లో బెంగళూరు-కామాఖ్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. నవంబర్ 1, 8, 15, 22వ తేదీల్లో ఎస్ఎంవీటి బెంగళూరు-కామాఖ్య(12551) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నవంబరు 5,12,19వ తేదీల్లో కామాఖ్య-ఎస్ఎంవీటి బెంగళూరు(12552) ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా అసన్‌సోల్, అండల్, సైంథియా స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ఆస్తులు లాగేసి... అనాథగా వదిలేసి

'నా పేరు రాజేష్(పేరు మార్పు). నేను ఆర్ఈసీఎస్ అనుబంధ రాజీవ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సీఎస్ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. కళాశాలలో క్లీనింగ్ చేసే సిబ్బందికి కూడా జీతాలు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులందరం కలిసి చందాలు వేసుకుని వారికి ఇస్తున్నాం. టాయిలెట్ల క్లీనింగ్ కూడా మేమే చేసుకుంటున్నాం. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వచ్చే డబ్బులతో కళాశాల మెయింటెనెన్స్ చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకపోవడంతో క్లాసులు సరిగ్గా జరగడం లేదు. కాలేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా సాగుతోంది.' ఇదీ ఈ ఒక్క విద్యార్థి ఆవేదనే కాదు పాలిటెక్నిక్ విద్యార్థులందరిదీ..ఆర్ఈసీఎస్ చేతికి వచ్చాక ఆస్తులు, మిగులు నిధులపై పెత్తనం చేస్తున్న ఈపీడీసీఎల్...ఆర్ఈసీఎస్‌కు చెందిన పాలిటెక్నిక్ కళాశాలను పట్టించుకోకుండా అనాథగా వదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

- ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణ గాలికి...
- ఆస్తులపై పెత్తనం తప్ప బాధ్యతలు తీసుకోని ఈపీడీసీఎల్
- 8 నెలలుగా సిబ్బందికి జీతాలు చెల్లించని వైనం
- తరగతులు సక్రమంగా సాగక విద్యార్థులకు ఇబ్బందులు



ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల

సాక్షి, అనకాపల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో కొంకోటలో ఉన్న గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ(ఆర్ఈసీఎస్)ను విలీనం చేసిన తరువాత దానికి అనుబంధంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాల పరిస్థితి దయనీయంగా మారింది. కనీస సౌకర్యాలు లేక, ఉద్యోగులకు జీతాలందక అధ్వాన దుస్థితి నెలకింది. దీంతో సిబ్బంది కుటుంబాలు ఎనిమిది నెలలుగా అర్థాకలితో అలమటిస్తుండగా సక్రమంగా తరగతులు సాగక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కళాశాలలో పనిచేసే ఉద్యోగులకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. ఆర్ఈసీఎస్ ఆస్తులు, మిగులు నిధులపై పెత్తనం చెలాయిస్తూ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసింది. కనీసం టాయిలెట్లు శుభ్రపరచడానికి కూడా నిధులు ఇవ్వడం లేదు. స్వీపర్లకు కూడా జీతాలు చెల్లించడం లేదు. క్లాస్ రూంలో మౌలిక వసతులు, తాగునీటి సదుపాయం కల్పించలేదు. కళాశాలలో మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు, ఇతర పనులకు విద్యార్థులు, సిబ్బంది తమ సొంత సొమ్మును చెల్లిస్తున్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో కొంత సొమ్మును కళాశాల నిర్వహణ పనులకు ఖర్చు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా నిలిచిపోయింది. కళాశాలలో రాజ్యమేలుతున్న సమస్యలను ఆర్ఈసీఎస్‌కు గౌరవ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ విజయకృష్ణన్, సంస్థకు ఎండీగా వ్యవహరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) ప్రసాద్ దృష్టికి పలుమార్లు కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులైన గ్రామీణ వినియోగదారులు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. స్థానిక కూటమి పార్టీ ఎమ్మెల్యేకు విన్నవించుకున్నా.. పట్టించుకున్న పాపానపోలేదు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం లేదు. ఈపీడీసీఎల్ వైఖరి, జిల్లా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా కారణంగా తరగతులు సరిగ్గా జరగడం లేదని, దీంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని తల్లిదండ్రులు, వినియోగదారులు వాపోతున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించాలని విద్యార్థి, వినియోగదారుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్ఈసీఎస్‌లో

మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా

వడ్డాదిలో విష జ్వరాలు


విష జ్వరాలు బారిన పడిన వారికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాదిలో రెల్లి వీధి, కొత్తూరుల్లో పలువురు విష జ్వరాలు బారినపడ్డారు. వాతావరణంలో మార్పులు, అపారిశుధ్యంతో జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు తెలిపారు. కె. లత, బి.మానస జ్వరంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరు ఇద్దరూ వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్టు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


తుర్రే పద్మ

రావికమతం: మండలంలో కొమిర గ్రామంలో వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు రావికమతం ఎస్‌ఐ రఘువర్మ చెప్పారు. వివరాలివి. వివాహిత తుర్రే పద్మ ఈ నెల 11 నుంచి కనిపించడంలేదని, ఆమె కోసం బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదని భర్త నరసింహమూర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్


స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి జిల్లాలో 46 కేంద్రాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అక్టోబరు 2 వరకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి తగిన వైద్య సేవలను అందించాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి, జిల్లా ఇమ్యునైజేషను అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వీరజ్యోతి పాల్గొన్నారు.

అరకొరగా యూరియా.. అన్నదాతల ఆందోళన


జి.అగ్రహారం సచివాలయంలో నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నారాయణరావు


ఎ.కె.వల్లాపురం సొసైటీ వద్ద యూరియా కోసం రచ్చబండ మీద నిరీక్షిస్తున్న రైతులు

- ఎం.కె.వల్లాపురం ఆర్‌ఎస్‌కేకు 267 బస్తాలు
- వీరనారాయణం, జి.అగ్రహారానికి కలిపి 240 బస్తాలు
- పోలీసుల సమక్షంలో యూరియా విక్రయాలు

యూరియా కోసం రైతుల పడిగాపులు కొనసాగుతున్నాయి. చాలినన్ని బస్తాల యూరియా రాకపోవడంతో సర్వత్రా రైతుల్లో ఆందోళన నెలకొంది. మంగళవారం కూడా మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ తీరును రైతులు నిరసించారు.

మాడుగుల రూరల్: యూరియా కొరత రైతుల్ని ఇంకా వేధిస్తోంది. అరకొరగా వచ్చిన యూరియా నిల్వలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరినాట్లకు సరైన సమయంలో అందించాల్సిన యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే నాట్లు వేసి రెండు మాసాలవడంతో యూరియా వేయక.. పంట దిగుబడిలో భారీగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో విత్తనాల నుంచి విక్రయాల వరకు అన్నీ సవ్యంగా జరిగేవని, ఎరువుల కోసం ఇంతగా ఎదురుచూడాల్సిన దుస్థితి ఎప్పుడూ లేదని వాపోతున్నారు.

కనీసం యూరియా ఇవ్వకపోతే ఎలా?

మండలంలోని ఎం.కె.వల్లాపురం సహకార సంఘానికి 267 బస్తాల యూరియా వచ్చింది. మంగళవారం ఉదయం నుంచి విక్రయాలు ప్రారంభించారు. ఈ సహకార సంఘం పరిధిలో గల గ్రామాలకు ప్రస్తుతం వచ్చిన యూరియా ఏమాత్రం సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు వేసి రెండు మాసాలు పూర్తి కావస్తున్న తరుణంలో యూరియా వేయకపోతే పంట దిగుబడి దారుణంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు కనీసం యూరియా కూడా ఇవ్వలేని స్థితిలో ఉందని ఎం.కోటపాడు గ్రామానికి చెందిన రైతు కోట్ని రామారావు మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎరువులు కొరత ఏనాడూ చూడలేదని ఆక్షేపించారు.

సచివాలయం వద్ద ఆందోళన

జి.అగ్రహారం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం మంగళవారం ఉదయం నుంచి రైతులు పడిగాపులు కాశారు. ఈ కేంద్రానికి 240 బస్తాల యూరియా వచ్చింది. జి.అగ్రహారం, వీరనారాయణం సచివాలయాలు కలిపి ఒకే క్లస్టర్ కావడంతో ఈ రెండు సచివాలయాల పరిధిలోని మూడు గ్రామాలకు 80 బస్తాల చొప్పున అందించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ రెండు సచివాలయాల పరిధిలో 1600 మంది రైతులకు 240 బస్తాల యూరియా ఏ మేరకు సరిపోతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు, చింతలూరు సర్పంచ్ కాళింగ కల్యాణరాజు వ్యవసాయ సిబ్బందిని ప్రశ్నించారు. పూర్తి స్థాయిలో యూరియా పంపిణీ చేయాలంటూ జి.అగ్రహారం, చింతలూరు, వీరనారాయణం రైతులు ఆందోళనకు దిగారు. స్థానిక ఎస్‌ఐ జి.నారాయణరావు తన సిబ్బందితో వచ్చి రైతులకు నచ్చజెప్పారు. గ్రామానికి 80 బస్తాలు చొప్పున సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. యూరియా అందని రైతులు ఇంకా ఎన్నాళ్లు ఎదురు చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు.

రావికమతం: దొండపూడి, కన్నంపేట, చినపాచిల రైతు సేవా కేంద్రాల వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు ఎగబడడంతో రైతు సేవా కేంద్రాల దగ్గర పోలీసులను మోహరించి వారి సమక్షంలో యూరియా విక్రయాలు జరిపారు. దొండపూడి రైతు సేవా కేంద్రానికి 150 బస్తాలు, కన్నంపేటకు 250 బస్తాలు, చినపాచిలంకు 140 బస్తాలు యూరియా సరఫరా అయ్యాయి.

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంటలో మంగళవారం యూరియా కోసం రైతులు ఉదయం 8 గంటలకే అధిక సంఖ్యలో రైతులు చేరుకున్నారు. గంటల తరబడి నిలబడ లేక పలువురు రైతులు కూర్చుండిపోయారు. స్టాక్ అరకొర ఉందని తెలియడంతో తమకు దక్కుతుందో లేదోనని ఆందోళనతో ఒక్కసారిగా ఎగబడడంతో తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దారు. టోకెన్ల ప్రకారం పంపిణీ చేశారు. గంటల తరబడి క్యూలైన్‌లో పడిగాపులు కాసినా యూరియా దక్కక పోవడంతో పలువురు రైతులు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

అడుగడుగునా ఇబ్బందులు



కూటమి ప్రభుత్వం రైతుల్ని నిలువునా ముంచేసింది. రైతు పండించే పంటకు ఎరువులు అందించలేని అధ్వాన స్థితిలో ఉంది. వరి నాట్లు వేసి రెండు మాసాలవుతోంది. ఇప్పటి వరకు ఎరువుల్లేక పంట నష్టపోయే పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్తి స్థాయిలో ప్రతి రైతుకు ఎరువులు అందించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతులకు అడుగడుగునా ఇబ్బందులే తలెత్తుతున్నాయి.

–గాడి ముత్యాలనాయుడు, రైతు, వీరనారాయణం

మత్స్యకారులపై ప్రభుత్వ నిర్బంధం అన్యాయం


జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న మత్స్యకారులు, సీపీఎం నాయకులపై కూటమి ప్రభుత్వం ఉద్యమ కారులపై ఉక్కుపాదం మోపడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక జోనల్ కార్యాలయంలో వద్ద పార్టీ ఆధ్వర్యంలో బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసులను మోహరించి మత్స్యకారులపై, సీపీఎం నాయకులపైన నిర్బంధం ప్రయోగించి శాంతియుత పోరాటాన్ని అణచివేయాలనే చూస్తే ప్రజాగ్రహానికి గురికాకతప్పదన్నారు. ప్రజాస్వామ్యంలో తమ నిరసనను స్వేచ్ఛగా తెలియజేసే హక్కు ప్రజలకు ఉందని, బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్న మత్స్యకారులపై పోలీసులు కేసులు పెడతామని బెదిరించి వారిని భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బల్క్‌డ్రగ్ పార్కు ప్రమాదకరమని చెప్పి వారి పోరాటంలో పాల్గొన్న టీడీపీ నాయకులు నేడు అధికారంలోకి రాగానే మాటమార్చడమంటే మత్స్యకారులను మోసం చేయడమేనన్నారు. ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా, స్థానిక వ్యతిరేకతను లెక్కచేయకుండా ప్రభుత్వం ఈ విధమైన నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, అల్లు రాజు, నాయకులు పి.చలపతి,నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన హైస్కూల్‌కు స్థల పరిశీలన


కొత్తగా ఏర్పాటు చేసే ముత్రాస్ కాలనీ హైస్కూల్ స్థల పరిశీలనలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీ ముత్రాస్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేయనున్న హైస్కూల్ స్థలాన్ని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్ భవనానికి 3 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు పేర్కొన్నారు. తరగతి గదులు, ఆటస్థలానికి వీలుగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఆశాజ్యోతి, కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, ఈవో సుభాష్, ఏఈ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోలుగా 9 మందికి పదోన్నతులు


నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న పరిపాలనాధికారులు(ఏవో), విస్తరణాధికారుల(ఈవోఆర్డీ)కు మండల పరిషత్ అభివృద్ధి అధికారులుగా(ఎంపీడీవో) పదోన్నతులు లభించాయి. మొత్తం 9 మందికి పదోన్నతులతో పాటు పోస్టింగ్‌లు ఇస్తూ జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర వారికి నియామక పత్రాలు అందజేశారు. జి.కె.వీధి ఎంపీడీవోగా బి.హెచ్.వి.రమణబాబు, బుచ్చయ్యపేట ఎంపీడీవోగా కె.ఎస్.సి.నారాయణరావు, రావికమతం ఎంపీడీవోగా ఒ.మహేష్, కశింకోట ఎంపీడీవోగా సి.హెచ్.చంద్రశేఖరరావు, కోట వురట్ల ఎంపీడీవోగా చంద్రశేఖరరావు, నాతవరం ఎంపీడీవోగా ఎం.ఎస్.శ్రీనివాసులు, ఎస్.రాయవరం ఎంపీడీవోగా మీనాకుమారి, పాయకరావుపేట ఎంపీడీవోగా విజయలక్ష్మి, ముంచంగిపుట్టు ఎంపీడీవోగా కె.ధర్మారావు నియమితులయ్యారు. పదోన్నతులు పొందిన అధికారులు వెంటనే విధుల్లో చేరాలని చైర్‌పర్సన్ సుభద్ర సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్తిబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వెలుగు వీవోఏల సమస్యల పరిష్కారానికి ధర్నా


డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీవోఏలు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో వీవోఏ మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 మాసాలవుతున్నా దాన్ని రద్దు చేయకుండా తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని వెలుగు వీవోఏల సంఘం(సిటు) రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ రూపాదేవి, సిటు జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావులు మండిపడ్డారు. స్థానిక సిటు కార్యాలయం నుంచి డీఆర్‌డీఏ కార్యాలయం వరకూ వీవోఏల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ శచీదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏలకు ఉరితాడుగా ఉన్న మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు, ఉద్యోగ భద్రత, పెండింగ్ జీతాల చెల్లింపు తక్షణమే చేయాలనానరు. వీవోఏలకు సంబంధం లేని చాలా పనులు చేయిస్తున్నారని, లబ్ధిదారులతో గేదెల కొనుగోలు, యూరియా సర్వే, వృద్ధుల పెన్షన్ విధులను కూడా అప్పగించడం ఆక్షేపణీయమన్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వని ప్రభుత్వం, పనుల్ని మాత్రం క్రమం తప్పకుండా చేయించుకుంటోందని ధ్వజమెత్తారు. ఆందోళనలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, వీవోఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటలక్ష్మి, కోశాధికారి సీహెచ్‌ఎల్‌ఎస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు బురదలో కూరుకుపోయిన వాహనాలు

వడ్డాది, నర్సీపట్నం రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు


బురదలో కూరుకుపోయిన వ్యాను

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం–నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల మధ్య బురదలో వాహనాలు కూరుకుపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నర్సీపట్నం నుంచి వడ్డాది వైపు వస్తున్న వ్యాను బంగారుమెట్ట సమీపంలో ఉన్న చర్చి వద్ద బురదలో కూరుకుపోయింది. దాని వెనకాలే వస్తున్న మరొక వ్యాను పక్క నుంచి వెళ్లే ప్రయత్నంలో అదీ బురదలో చిక్కుకుంది. రెండు వ్యాన్లు ఒకే గోతి వద్ద పక్క పక్కనే కూరుకుపోవడంతో ఇతర వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా పోయింది. దీంతో నర్సీపట్నం, వడ్డాది రూటులో తిరుగుతున్న ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలూ నిలిచిపోయాయి. రాత్రిపూట వేగంగా ఇంటికి చేరుకోవాలని వెళ్తున్న రావికమతం, కొత్తకోట, రోలుగుంట, చోడవరం, వడ్డాది, అనకాపల్లి, విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లే పలువురు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. చీకట్లో ఎటూ వెళ్లలేక నరకయాతనపడ్డారు. ఉదయం కూడా ఇదే గోతి వద్ద వ్యాన్ ఇతర వాహనాలు కూరుకుపోగా ట్రాక్టర్ల సహాయంతో బైటకు లాగారు. ఆర్ అండ్ బీ అధికారులు తక్షణం ఈ గోతిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉంగరం చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

యలమంచిలి రూరల్: పట్టణంలోని భవనం వీధిలో లక్ష్మీ గణపతి జ్యూయలర్స్ నగల దుకాణంలో బంగారు ఉంగరం చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులకు ఆరు నెలల చొప్పున యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు నాయమూర్తి మంగళవారం జైలుశిక్ష విధించినట్టు పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం జెండా వీధి, రైస్‌పేటకి చెందిన పిన్నింటి గణేష్(27), కొవ్వూరు మాణిక్యేశ్వరి(25) యలమంచిలి భవనంవీధిలో ఉన్న సున్నం నానిబాబు నగల దుకాణంలోకి ప్రవేశించి బంగారు ఉంగరం దొంగలించారు. దీనిపై నగల దుకాణం యజమాని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో తేలిన మృతదేహం

ట్యాక్సీ డ్రైవర్‌గా గుర్తింపు ■ ఒంటరితనంతో ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారణ


ఘటనా స్థలంలో బావిలోంచి బయటకు తీసిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న పట్టణ ఎస్‌ఐ సావిత్రి

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాంనగర్ టిడ్కో గృహ సముదాయం వెనుక బావిలో తేలిన మృతదేహం యలమంచిలి పట్టణానికి చెందిన ట్యాక్సీ డైవర్ అప్పికొండ రమణ(59) గా పట్టణ పోలీసులు గుర్తించారు. స్థానిక ఫైర్ ఆఫీస్ కాలనీకి చెందిన మృతుడు కొన్నేళ్ల క్రితం భార్యతో గొడవపడి ఒంటరిగా ఉంటున్నాడు. మద్యానికి బానిసైన రమణ జీవితంపై విరక్తితో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని అతని సమీప బంధువు అప్పికొండ చంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ కె. సావిత్రి మంగళవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. బావిలోంచి దుర్వాసన రావడంతో అక్కడ పశువుల కాపరి కొండలరావు మృతుని బంధువులకు సమాచారమిచ్చినట్టు పోలీసులు పేర్కొన్నారు. బావి పక్కనున్న ఎర్ర రంగు బ్యాగులో మృతుని గుర్తింపు కార్డు, చిరునామా లభించాయి. మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీయించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

యలమంచిలి రూరల్: జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో అండర్ 19 బాల బాలికల స్కూల్ గేమ్స్ ఎంపికలు ఈ నెల 18వ తేదీ గురువారం నుంచి జరుగుతాయని ఉమ్మడి విశాఖ జిల్లా జూనియర్ కళాశాలల గేమ్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.ఎ. పుష్పలత తెలిపారు. 2007 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన 6 నుంచి 12వ తరగతి లోపు బాలబాలికలు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు.ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు ఆయా ప్రాంతాల్లో జరిగే ఎంపికలకు ఉదయం 7 గంటలకు చేరుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9440885898, 9951676965, 9966931556, 9985065340, 9885473808, 9493883466 నంబర్లలో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

ఎంపికల షెడ్యూల్ ఇలా...

తేదీ/సమయం	గేమ్	ఎంపిక స్థలం
18.09.2025	రెజ్లింగ్, తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ తంగతా, గట్కా, మోడ్రన్ పెంటలాన్	ఎస్‌వీఎస్ జూ.కాలేజీ, పరవాడ
19.09.2025	టెన్నిస్	ఏయూ గ్రౌండ్స్
19.09.2025	స్విమ్మింగ్, వాటర్ పోలో	వైఎంసీఏ
19.09.2025	స్కేటింగ్, బీచ్ వాలీబాల్	ఉడా పార్క్
19.09.2025	టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్	ఇండోర్ స్టేడియం,గోపాలపట్నం
19.09.2025	వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్	డాక్టర్ఎల్‌బీ జూ.కాలేజీ, విశాఖపట్నం
20.09.2025	అథ్లెటిక్స్, రగ్బీ	ఏఎంఏఎల్ జూ.కాలేజీ, అనకాపల్లి

ఆస్తులు లాగేసి... అనాథగా వదిలేసి

▶7వ పేజీ తరువాయి

50 మందికి సిబ్బంది నెలకు రూ.13 లక్షల వరకూ జీతాలు చెల్లించాలి. ఎనిమిది నెలలకు గానూ రూ.1.04 కోట్ల వరకు చెల్లించవలసి ఉంది. కళాశాలలో మౌలిక వసతులు, ఇతర నిర్వహణ పనులకు ఏడాదికి సుమారు రూ.30 లక్షలు ఖర్చు అవుతుంది. ఆ సొమ్ము కూడా ఈపీడీసీఎల్ చెల్లించడం లేదు.

సంస్థ ఆస్తులతోనే కళాశాల నిర్వహణ...

ఐదు మండలాల్లో ఉన్న గ్రామాల్లో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపార అవసరాల నిమిత్తం నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే లక్ష్యంతో 50 ఏళ్ల క్రితం అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ(ఆర్‌ఈసీఎస్)ను ఏర్పాటు చేశారు. సుమారు రెండు లక్షల పై చిలుకు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేస్తూ లాభాల బాటలో పయనించింది. ఈ ప్రాంత వినియోగదారుల పిల్లలకు సాంకేతిక విద్యను అందించేందుకు కశింకోటలో రాజీవ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ కళాశాల నిర్వహణ ఖర్చులు ఆర్‌ఈసీఎస్ నిధుల నుంచి చెల్లించేందుకు, వినియోగదారుల పిల్లలకే సగం సీట్లు కేటాయించేందుకు తీర్మానించారు. ప్రస్తుతం 720 మంది విద్యార్థులతో కళాశాల కొనసాగుతోంది. అయితే ఆర్‌ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేయాలని నిర్ణయించారు. ఆర్‌ఈసీఎస్ విలీన ప్రక్రియ కార్యకలాపాల వరకే అప్పగించాలని ఏపీఈఆర్‌సీ ఆదేశించింది. సంస్థ ఆస్తుల.. అప్పుల సెటిల్‌మెంట్ జరిగే వరకు..ఆ సంస్థ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణను ఆర్‌ఈసీఎస్ ఆదాయంతోనే జరపాలని స్పష్టంగా ఆదేశించారు. ఆర్‌ఈసీఎస్ ఆస్తులు, అప్పుల సెటిల్‌మెంట్‌ను పెండింగ్‌లో ఉంచి, సంస్థ కార్యకలాపాలను ఏపీఈపీడీసీఎల్ నిర్వహించాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఈసీఎస్ పరిధిలో గల ఐదు మండలాలకు చెందిన గ్రామీణ వినియోగదారులు చెల్లించిన రూ. 2 కోట్ల మిగులు నిధులు, రూ. 6.5 కోట్ల విలువ గల స్టోర్స్ మెటీరియల్, పాలిటెక్నిక్ కళాశాల మిగులు నిధులు సుమారు రూ. 2.28 కోట్లను ఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకుంది. ఆర్‌ఈపీఎస్ ఖాతాలో జమ చేయవలసిన మిగులు నిధులు 402.96 కోట్లను ఏపీఈపీడీసీఎల్ ఖాతాలో జమచేసున్నారు. ఏపీఈఆర్‌సీ ఆదేశాలకు విరుద్ధంగా మిగులు నిధులను, సంస్థ పంపిణీ వ్యవస్థను, కార్యాలయాలను, ఉద్యోగులను వినియోగించుకుని వ్యాపారం చేస్తూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న ఏపీఈపీడీసీఎల్... పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణ బాధ్యతను మాత్రం గాలికి వదిలేసింది.

ప్రజాస్వామ్యమా?.. పోలీస్ రాజ్యమా?

▶7వ పేజీ తరువాయి


మత్స్యకారులకు సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు వీసం రామకృష్ణ, కోటేశ్వరరావు

ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఇలాంటి కంపెనీలను వ్యతిరేకించి ఇప్పుడు ఎలా ఏర్పాటు చేస్తారన్నారు. పోలీసుల మానవతా దృక్పదంతో ఆలోచించి నిరసన తెలియజేయడానికి మత్స్యకారులకు సహకరించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకుడు గోసలరాజశేఖర్, ఎరిపిల్లి నాగేశులు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి బల్క్ డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధిగా హోంమంత్రి అనిత ఒక్కసారి కూడా గ్రామంలోకి రాలేదన్నారు. అమాయకులైన మత్స్యకారులను ప్రభుత్వం బలిపశువులను చేయాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకైనా తెగిస్తామని, బల్క్ డ్రగ్‌పార్క్ ఏర్పాటు కానివ్వబోమని స్పష్టం చేశారు.ఈ ఆందోళనలో మత్స్యకారులు పిక్కి తాతీలు, మహేష్, ఎం.సూరిబాబు, పిక్కి కోదండరావు, పిక్కి గంగరాజు, యజ్జల అప్పలరాజు, పిక్కి రాంబాబు, పైడితల్లి, పిక్కరాజేష్, సోమేష్, కాశీరావు, సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎం.రాజేష్, రైతు సంఘనాయకులు సత్యనారాయణ వందలాది మంది మత్స్యకారులు మహిళలు పాల్గొన్నారు. సీఐ కుమార స్వామి, ఎస్‌ఐలు సన్నిబాబు, అంజు తదితరుల ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు.

వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం కుట్రలు దారుణం

వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ


కేవీ రమణ

దేవరాపల్లి: వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం కుట్రలు చేసి, వైద్య వృత్తిలోకి రావాలనుకునే పేద విద్యార్థుల కలల్ని నాశనం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ ఆరోపించారు. ఈ మేరకు దేవరాపల్లిలో మంగళవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. వైద్య విద్యకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలోనే నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సైతం ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించాలని కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే 17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం పేదలకు వైద్య విద్యను దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలకతీతంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

క్లుప్తంగా

వేగం కన్నా ప్రాణం మిన్న



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్: వేగం కన్నా ప్రాణం మిన్న అని పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ పేర్కొన్నారు. స్థానిక డైట్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలన్నారు. ఆటో, బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా బస్సుల్లో ప్రయాణించేటప్పుడు చేతులు కిటికీల ద్వారా బయటకు పెట్టరాదన్నారు. రోడ్డు ప్రమాదాలలో యువతే ఎక్కుగా ప్రమాదాల బారిన పడుతున్నారని, అందువల్ల మోటార్ సైకిళ్లపై ప్రయాణించేటప్పుడు నిర్ణీత వేగం మించరాదన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని నిరసన



డంపింగ్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లి టౌన్: పట్టణ నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు డిమండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయ ఆవరణలో డంపింగ్ యార్డు వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైస్కూల్, కళాశాల విద్యార్థులు ఇక్కడ డంపింగ్ యార్డు వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. దీన్ని తరలిస్తామని ఎమ్మెల్యే కొణతాల హామీ ఇచ్చినా నెరవేరలేదన్నారు. సమీప ప్రాంతాలన్నీ బురదతో నిండి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నేతలు బొడ్డేడ అప్పారావు, చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


ఆదమరిస్తే.. అంతే సంగతులు



కన్యకాపరమేశ్వరి ఆలయం జంక్షన్ వద్ద పైకప్పు వేయని కల్వర్టు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మెయిన్ రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లే జంక్షన్ రహదారిలో కల్వర్టుపై పైకప్పు వేయకపోవడం వల్ల అటుగా ప్రయాణించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలోనే కాయగూరల మార్కెట్, అయ్యప్ప స్వామి ఆలయం, సినిమా థియేటర్లకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత రద్దీగా ఉన్న ప్రాంతంలో రోజుల తరబడి కల్వర్టుపై పైకప్పు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 95 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,650	4,900
రెండో రకం	3,810	3,860
మూడోరకం	3,690	3,700

అనకాపల్లి సినిమాలు

రాజా	: మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: కొత్త లోక
పర్తిసాయి	: ఘాటీ
షిర్డిసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2, బీ పాజిటివ్-9, ఓ పాజిటివ్-19, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

కాలుష్య కోరల్లో బొజ్జన్నకొండ



గోతులతో బొజ్జన్నకొండ రోడ్డు

- టిప్పర్ల రాకపోకలతో రేగుతున్న దుమ్ము, ధూళి
- పర్యాటక రోడ్డును మైనింగ్ అవసరాలకు వినియోగం
- అధ్వానంగా మారిన రోడ్డు
- వాహనదారుల ఇక్కట్లు



బొజ్జన్నకొండ రోడ్డులో ధూళి వెదజల్లుతున్న టిప్పర్లు



అధ్వానమైన గోతులతో బొజ్జన్నకొండ రోడ్డు

తుమ్మపాల: జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణానికి అత్యంత సమీపంలో ప్రశాంత వాతావరణంలో పచ్చని పొలాల మధ్య పురాతన కట్టడాలతో అలరారుతున్న బొజ్జన్నకొండ కాలుష్య కొరల్లో చిక్కుకుంది. పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయాలనే తపనతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.5 కోట్లతో పూర్తి చేసిన రోడ్డు ప్రస్తుత కూటమి పాలనలో మైనింగ్ టిప్పర్ల రాకపోకలకు రాచమార్గంగా తయారైంది. కేంద్ర నిధులు రూ.7.5 కోట్లతో బొజ్జన్నకొండ జిల్లాలోనే ప్రముఖ పర్యాటక క్షేత్రంగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో మైనింగ్ టిప్పర్ల రాకపోకలతో అక్కడ పరిసరాలు దుమ్ము, ధూళితో కాలుష్యమయంగా మారిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో నడుచుకుంటూ సేదతీరేందుకు వచ్చే క్రీడాకారులు, యువకులతోపాటు మహిళలు, వృద్ధులు, ముఖ్యంగా వైద్యులు సైతం దరిదాపుల్లో దరిచేరడం లేదు. బండరాళ్లు, క్రషర్, పిక్క వంటివి టిప్పర్లలో లోడింగ్ చేస్తూ నిత్యం రాత్రింబవళ్లు తిరగడంతో బొజ్జన్నకొండ రోడ్డుతోపాటు పరిసరాలను వాయు కాలుష్యం కప్పేస్తోంది.

ధ్వంసమైన నాలుగు కిలోమీటర్ల రోడ్డు...

మండలంలో కూటమి నాయకులు దోచుకుంటున్న మైనింగ్ సంపద నిత్యం వందల లారీలతో తరలిపోతూ రోడ్లను ధ్వంసం చేస్తున్నారు. పరిమితికి మించి లోడింగ్‌తో గ్రామాలు దాటి టిప్పర్లు నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై ప్రయాణిస్తున్నాయి. రోడ్లపై తీవ్రమైన ధూళి ఏర్పడింది. బొజ్జన్నకొండకు నాలుగు కిలోమీటర్ల రహదారి ఏడాదిలోనే తీవ్రంగా ధ్వంసమైంది. బొజ్జన్నకొండ రోడ్డు తుమ్మపాల జంక్షన్‌లో ఏర్పడిన గోతులు చెరువులను తలపిస్తున్నాయి. అటుగా ప్రయాణించే ప్రయాణికులు గోతులు దాటడం కోసం రోడ్డు మధ్యలోంచి వెళ్లే క్రమంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏలేరు కాలువ ఆనుకుని నాలుగు కిలోమీటర్ల పొడవున రోడ్డు రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. మితిమీరిన వేగంతో టిప్పర్లు వెళ్లడంతో ద్విచక్ర వాహనదారులు కళ్లు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డు బీటలు వారి పెచ్చులు ఊడుతున్నాయి.

ప్రధాన ఆర్చ్ వద్ద మరింత నరకం....

జాతీయ రహదారి శంకరం వద్ద బొజ్జన్నకొండకు వెళ్లే రోడ్డు నరకానికి ప్రధాన ద్వారంలా మారింది. ఏలేరు కాలువపై ఫ్లై ఓవర్ కారణంగా జాతీయ రహదారిని బొజ్జన్నకొండకు అనుసంధానం చేసిన వన్ వే రోడ్డు పొలాలకు పదడుగుల ఎత్తున నిర్మించారు. రక్షణ గోడ లేకపోవడం నిమిషం గడువు లేకుండా క్వారీ టిప్పర్లు రాకపోకలతో రోడ్డంతా గోతులు ఏర్పాడ్డాయి. గోతుల్లో క్రషర్ బుగ్గ వేయడంతో ధూళి రేగి ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వస్తున్న టిప్పర్ల వేగానికి పొలాల్లో పలు వాహనాలు పడిపోతున్నాయి. పర్యాటక ప్రాంతాలను వదిలి శివారు ప్రాంతాల్లో మైనింగ్ టిప్పర్లకు మార్గాలు వేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

టిప్పర్ల రాకపోకలు నిలిపివేయాలి



పర్యాటకంగా రూపురేఖలు మారుతున్న బొజ్జన్నకొండ పరిసరాలు కాలుష్యంగా తయారయ్యాయి. రోడ్డు గోతులతో దారుణంగా మారిపోయింది. టిప్పర్ల అపరిమిత వేగంతో అటుగా వెళ్లాలంటే భయంగా ఉంటుంది. గతంలో రన్నింగ్, వాకింగ్ చేసేవారంతా ఇప్పుడు రావడం మానేశారు. రానున్న కార్తీక మాసంలో బొజ్జన్నకొండకు వచ్చి భక్తులు పూజలు చేయడం, కుటుంబ సమేతంగా వనసమారాధనలు, పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులు అధికంగా వస్తుంటారు. అధికారులు రక్షణ చర్యల్లో భాగంగా మైనింగ్ టిప్పర్ల రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ రోడ్ల ద్వారా మళ్లించాలి.

–జి.రాము, శంకరం, అనకాపల్లి

కృష్ణాపురం రైతుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కృష్ణాపురం రైతులు

అనకాపల్లి: స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద రాంబిల్లి మండలం కృష్ణాపురం గ్రామ రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005లో కంపెనీల ఏర్పాటుకు 130 మంది భూములు కోల్పోయారన్నారు. వీరికి ఆర్ అండ్ ఆర్ విధానం ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్ప నేటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాల క్రితం ప్యాకేజీ మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారని, ప్రస్తుత రేటు ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేశారు. కార్యక్రమంలో రాంబిల్లి గ్రామం రైతులు లక్ష్మి, సత్యవేణి, స్వప్న, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక బస్సులపై వినతి



డీఎం అనుపమశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ)లో వృద్ధులకు, పురుషులకు, దివ్యాంగులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని, స్త్రీ శక్తి పథకానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కాంద్రేగుల దుర్గాప్రసాద్‌రావు, కె.అప్పారావు కోరారు. స్థానిక డిపో మేనేజర్ అనుపమశ్రీకి మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం వల్ల బస్సుల్లో సీట్లు మహిళలతో నిండిపోతున్నాయని వాపోయారు. వృద్ధులు, దివ్యాంగులు, పురుషులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రయాణంలో 50 శాతంతో కూడిన రాయితీని ఇవ్వాలని కోరారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

- ఏఐవైఎఫ్ నేతల ధ్వజం
- నేడు రాష్ట్ర సదస్సు



ఏఐవైఎస్ 17వ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనకాపల్లి: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, కొత్త పరిశ్రమలను తీసుకురావడంతో సీఎం చంద్రబాబు విఫలమైనట్టు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నెలకు నిరుద్యోగ భృతి రూ.3వేలు తక్షణమే అమలు చేయాలని, అమరావతి రాజధాని ప్రాంతాన్ని తక్షణమే ఫ్రీజోన్ గా ప్రకటించాలని, స్థానికంగా, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు 70శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్ లెక్చరర్ టీచింగ్ , నాన్ టీచింగ్, లైబ్రరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను అన్ని విభాగాల్లో భర్తీ చేయాలని, వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని వారిలో విద్యార్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో భర్తీకి అవకాశం కల్పించాలని, పేద నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సెంటర్లు అందుబాటులోకి తెచ్చి ఉచితంగా మెటీరియల్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 17న విజయవాడలో జరిగే సదస్సుకు నిరుద్యోగులు హాజరు కావాలని ఆయనపిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు గొర్ల అప్పలరాజు, బాలి బోయిన సురేష్, ఈగల గోపిసురేష్, బోయిన నారాయణరావు, భర్నికాన సాయి పాల్గొన్నారు.

వాహనమిత్ర అమలు చేయాలని డిమాండ్

అనకాపల్లి: స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందని, నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పెదిరెడ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం గడువు పెంచాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నంబర్ 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన ఆటో కార్మికులు ప్రమాద బీమా సొమ్ము ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ, జిల్లా కార్యదర్శి కోరిబిల్లి జగదీష్, నాయకులు సూరిశెట్టి బాపునాయుడు, మార్కండేయులు, వారధి గోవింద్, రమణ, వెంకటేష్, ఆదినారాయణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్..గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. 15 కంపెనీల్లో ఎంపికలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9000092227, 8106327482 నంబర్లను సంప్రదించాలన్నారు.

45 మందికి కిడ్నీ వ్యాధి నిర్ధారణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి: మండలంలో 11 గ్రామాల్లో 2,670 మందికి కిడ్నీ పరీక్షలు నిర్వహించారని, 45 మంది వ్యాధికి గురైనట్లు వైద్యాధికారులు నిర్ధారించారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో విడతగా ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి నెఫ్రాలజీ వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు చేసి 45 మందికి కిడ్నీ వ్యాధి గుర్తించారన్నారు. వీరికి మరో సారి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.కృష్ణారావు, డీఎంహెచ్‌వో ఎం.హైమావతి పాల్గొన్నారు.

గోశాల లేఅవుట్‌లో పందులతో రగడ



నివాసితులకు, పందుల పెంపకందారుకు వాగ్వాదం

సింహాచలం: గోశాల లేఅవుట్‌లో ఇటీవల పందుల బెడద ఎక్కువగా ఉండటంతో గోశాల నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు నివాసితులు ఫిర్యాదు చేయడంతో వాటిని షూట్ చేసేందుకు జీవీఎంసీ సిబ్బంది మంగళవారం వచ్చారు. విషయం తెలుసుకున్న పందుల పెంపకందారు అక్కడికి వచ్చి హడావుడి సృష్టించాడు. దీంతో స్థానిక నివాసితులు పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. నివాసాల మధ్య పందుల్ని ఎలా వదిలేస్తారని, వాటివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెంపకందారుని నిలదీశారు. ఇక మీదట ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. పందుల పెంపకందారు వెనక్కి తగ్గడంతో వివాదం సద్దుమణిగింది.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామ్మోహన్‌రావు



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామ్మోహన్‌రావు

కశింకోట: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, ఉప సంచాలకుడు డాక్టర్ బి రామ్మోహన్ రావు తెలిపారు. కశింకోటలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన దూడల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. చికిత్స కన్నా నివారణ ఎంతో మేలని, సకాలంలో పశువులకు టీకాలు వేయడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం తగ్గుతుందన్నారు. ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతులు ఆదాయం సమకూర్చుకోవచ్చనన్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల అక్టోబర్ 15 వరకు జరుగుతుందన్నారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగాభవాని, కసింకోట పశు వైద్యాధికారి సిహెచ్. చైతన్యమణి, సిబ్బంది ఈశ్వరరావు, మల్లేష్, 1962 సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం పడికాపులు



వెంకుపాలెంలో యూరియా కోసం రైతులు ఎదురుచూపులు

అనకాపల్లి: మండలంలో వెంకుపాలెం రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం రైతులు యూరియా కోసం పడికాపులు పడ్డారు. కూటమి నాయకులు వచ్చే వరకూ అధికారులు ఇక్కడ కేంద్రం తలుపులు తీయలేదు. దాంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం మూడు పంచాయతీల రైతులకు 230 యూరియా బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు బుధవారం అందజేస్తామని గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు చెప్పడంతో వారు వెనుతిరిగారు. అదేవిధంగా సీహెచ్‌ఎన్ అగ్రహారం రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియాను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి పి.యు.పి. బి.రంగాచారి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంతవరకూ రైతులకు 656 మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీ చేశామన్నారు. మరో 96 మెట్రిక్ టన్నులు యూరియా తగరంపూడి, వెంకుపాలెం, తుమ్మపాల, మామిడిపాలెం, సంపత్‌పురం, సీహెచ్‌ఎన్ అగ్రహారం గ్రామంలో అందుబాటులో ఉందన్నారు. సీహెచ్‌ఎన్ అగ్రహారం గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రావణి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు



నిరుద్యోగ యువతతో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, ఎంపీడీవో ఆశాజ్యోతి

అనకాపల్లి: నిరుద్యోగ యువత చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మేడపైన ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పరిశ్రమలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వశక్తిగా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమలు స్థాపించేందుకు కొన్ని రకాల సర్టిఫికెట్లు కోసం వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, ఏజెడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ సీఈవో కాళ్ల జగపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు జాగ్రత్తలు అవసరం



ఎయిడ్స్ సంచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో హైమావతి

అనకాపల్లి: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి బారినపడే వ్యక్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణ డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం వద్ద ఎయిడ్స్ నియంత్రణ స్వచ్ఛంద ఆధ్వర్యంలో సంచార వాహనాన్ని మంగళవారం జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్షితమైన లైంగిక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రామచందర్ , క్లస్టర్ ప్రివెన్షన్ అధికారి రామనాయుడు, ఐసీటీసీ కౌన్సిలర్స్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర ఆవశ్యకతపై ర్యాలీలు



కశింకోట డీపీఎన్ జడ్పీ హైస్కూల్లో ఓజోన్ సాంకేతిక నామం ఓ3 ఆకారంలో విద్యార్థుల విన్యాసం

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో ఓజోన్ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓజోన్ పొర ఆవశ్యకతను వివరిస్తూ ఓజోన్ సాంకేతిక నామం ఓ3 ఆకృతిలో కూర్చొని విన్యాసాలు ప్రదర్శించారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు గొడుగులతో ప్రదర్శన చేశారు. ఓజోన్ పొర విశిష్టత వివరిస్తూ విద్యార్థులు వేసిన చిత్రలేఖనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ జే వి ప్రసాద్ , సైన్స్ ఉపాధ్యాయిని శ్యామల, పీడీలు వి. ప్రభాకర్ రావు, పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. నరసింగబిల్లి హైస్కూల్లోనూ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర పరిరక్షించాల్సిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గొడుగుల ప్రదర్శన చేశారు. ఓజోన్ పొర ఆవశ్యకతపై విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ప్రదర్శించారు. చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు బీవీ లక్ష్మి, సారధి, విశాలాక్షి, స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్ మణిరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఓ.రుధిరారాణి తెలిపారు. స్థానిక హైస్కూల్ నుంచి నెహ్రూచౌక్ వరకూ ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.